

సిద్ధమవుతున్న గణనాథులు

కొత్తకోటలో రూపుదిద్దుకుంటున్న ప్రతిమలు • ఆర్డర్ల కోసం తయారీదారులు ఎదురుచూపులు



భారీ వినాయకుడు



కంచుగుమల కూడలిలో విక్రయాలకు సిద్ధం చేస్తున్న గణపతి విగ్రహాలు



చిట్టి వినాయకుడు

రోలుగుంట: ఆది దేవుడు గణేష్ నవరాత్రి ఉత్సవాలు దగ్గర పడుతున్నాయి. ఇప్పటి వరకూ మండల వాసులు పొరుగు మండలాలకు వెళ్లి ఉత్సవ విగ్రహాలను కొనుగోలు చేసి, తెచ్చుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన కుమ్మరి కుటుంబాలు కుండలు, పొయ్యిలు, తదితర మట్టి పాత్రలతో పాటు గణనాథుడి విగ్రహాలను కూడా తయారీ చేసి, ఉపాధి పొందుతున్నారు. కంచుగుమల కూడలిలో గతేడాది ఒక్కరే విగ్రహాలను తయారు చేయగా.. ఈ ఏడాది ముగ్గురు తయారీదారులు స్థానికంగా భూములు లీజుకు తీసుకుని షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. నక్కా సత్తిబాబు, నక్కా సురేష్, అనబత్తిన మహేష్ బీఎస్ రోడ్డు, కంచుగుమల కూడలిలో షెడ్లు నిర్మించుకుని విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన మెటీరియల్‌ను తయారీదారులు ముందుగానే తెచ్చుకున్నారు. కొబ్బరిపీచు, ఉత్సవ విగ్రహాల అచ్చులు రాజస్థాన్ నుంచి తెప్పించుకున్నారు. గత వారం రోజులుగా సైజుల వారీగా విగ్రహాల తయారీ చేపట్టారు. రెండున్నర అడుగుల నుంచి పది అడుగుల ఎత్తు గల విగ్రహాలను తయారు చేస్తున్నారు. వాటికి భక్తులను ఆకర్షించే విధంగా రంగులు అద్దుతున్నారు. సైజును బట్టి రూ.1000 నుంచి రూ.20 వేలు వరకూ నిర్ణయించారు. ఒక్కో యజమాని రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. యజమానులతో పాటు సుమారుగా 20 నుంచి 25 మంది వరకు ఇక్కడ ఉపాధి పొందుతున్నారు.

ఇప్పటికీ ఎటువంటి ఆర్డర్లు రాలేదు..

గతేడాది ఇదే సమయానికి విగ్రహాలు కావాలని గ్రామాల నుంచి వచ్చి అడ్వాన్స్‌లు ఇచ్చి ఆర్డర్లు ఇచ్చేవారు. తమ చిరునామాలు ఇచ్చి, వాహనాలతో వచ్చి స్వయంగా విగ్రహాలను తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఇప్పటికి ఎటువంటి ఆర్డర్లు రాలేదు. పండగ మూడు, నాలుగు రోజుల ముందు డిమాండ్ ఉంటుందేమో చూడాలి.

– నక్కా సురేష్, తయారీదారుడు, కొత్తకోట

సైజ్‌ను బట్టి ధరలు



రెండు అడుగుల నుంచి పది అడుగుల సైజు వరకూ తయారు చేస్తాం. సైజులను బట్టి ధరలు నిర్ణయించి, విక్రయిస్తాం. ఈ ఏడాది మూడు చోట్ల విగ్రహాలను తయారు చేస్తున్నాం. విక్రయాలు తగ్గి, ధరలో కొంత వ్యత్యాసం వచ్చే పరిస్థితి ఉంటుంది. కరువు ఛాయలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి.

– నక్కా సతీష్, తయారీదారుడు, కొత్తకోట

క్లుప్తంగా

ఉత్సాహంగా వాకర్స్ క్లబ్ ఆటల పోటీలు



పరుగు పందెంలో తలపడుతున్న వాకర్స్

చోడవరం: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా చోడవరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి రాంబాబు చెప్పారు. ఈ క్లబ్‌లో 45 80 ఏళ్ల వయస్సున్న వారంతా సభ్యులుగా ఉన్నారన్నారు. వీరంతా ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నింగ్, వాకింగ్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, తదితర పోటీలు పాల్గొని సత్తా చాటారు. విజేతలకు స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు.

రెండు పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

దేవరాపల్లి: దేవరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా పూడి సత్యారావు, సభ్యులుగా చల్లా ఎరుకునాయుడు, గొంతిన నర్సింహమూర్తి నియమితులయ్యారు. కలిగొట్ల పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా దొగ్గ దేముడునాయుడు, సభ్యులుగా పోతల శ్రీనివాసరావు, నున్నగొప్పల నర్సింగరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల: శ్రావణమాసం ఆదివారం సందర్భంగా మాడుగుల మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఏఎల్‌పురంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'



ఏఎల్‌పురంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గొలుగొండ: సీఎం చంద్రబాబు పాలనలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచి పాలన సాగిస్తున్నారని ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ సభ్యులు బుల్లి ప్రసాద్, మామిడి కృష్ణ ఆరోపించారు. ఏఎల్ పురం గ్రామంలో శనివారం రాత్రి బాబూ ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వైఎస్సార్‌సీపీ నేతలు వెళ్లి చంద్రబాబు ఇచ్చిన అబద్ధపు హామీలను గుర్తు చేశారు. సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ప్రజలను మభ్యపెట్టారన్నారు. కూటమి పాలనలో ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదని, ఆ పార్టీల నేతలకు మాత్రమే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శివ, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



డాక్టర్ శివను సన్మానిస్తున్న ఆత్మజ్యోతి పిరమిడ్ నిర్వాహకులు

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం కోసం రోజూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ శివ కోరారు. చౌడువాడలో ఆత్మజ్యోతి పిరమిడ్ ధ్యాన కేంద్రం వద్ద శనివారం రాత్రి పౌర్ణమి ధ్యానంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శివ మాట్లాడుతూ ఎటువంటి ఖర్చు లేకుండా ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యం, ఒత్తిళ్లను అధిగమించేందుకు శ్వాస మీద ధ్యాస పెట్టాలని సూచించారు. నా అనే పదాన్ని వదిలి అందరూ మనం అనే విధంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. పౌర్ణమి ధ్యాన కార్యక్రమానికి హాజరైన వారితో ధ్యానం చేయించారు. అనంతరం శివను ఆత్మజ్యోతి పిరమిడ్ నిర్వాహకులు, పిరమిడ్ మాస్టర్లు బీశెట్టి మీనా, మహోహర్, సత్యనారాయణ, నాగ అప్పారావు, వెంకటరావు సన్మానించారు.

గంగాలమ్మ తల్లి మాలధారణ



గంగాలమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాలధారులు

మునగపాక: మూలపేటలో ఆదివారం భక్తులు గంగాలమ్మ తల్లి మాలలు ధరించారు. ఈ నెల 19వ తేదీన జరగనున్న ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా మాల ధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాతకు ధ్రువపత్రం అందజేస్తున్న నిర్వాహకులు, గ్రామ నాయకులు

రావికమతం: కొత్తకోట గ్రామంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. నర్సీపట్నం రోటరీ క్లబ్, తాసుపల్లి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవి ఫంక్షన్ హాల్ ఆవరణలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ రక్తదాన శిబిరాన్ని నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. తొలుత కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ రక్తదానం చేశారు. అనంతరం పలు సంఘాలకు చెందిన యువకులు దాదాపు 50 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్, సర్పంచ్ లోవరాజు, వైస్ సర్పంచ్ పందల దేవా, వైఎస్సార్‌సీపీ నాయకుడు తలారి ఆదిమూర్తి, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోట గోవిందరావు, శ్రీశాంతి ఆటో యూనియన్ ప్రతినిధి బుంగా బుల్లిబాబు, పరవాడ నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు నారాయణరావు, రాంబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం రేపు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సీతారామస్వామి దేవస్థానం భూములు కౌలుకు సాగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్టు గ్రామ రెవెన్యూ అధికారి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తామన్నారు. కొరుప్రోలులో సర్వే నెంబర్ 101–4లో 4.86 ఎకరాలకుగాను రూ. 5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. గుర్రాజుపేటలో సర్వే నెంబర్ 136–2లో 0.33 ఎకరాలకు రూ. 20 వేలు, సర్వే నెంబర్ 133లో 4.46 ఎకరాలకు రూ.5 వేలు, సర్వే నెంబర్ 202–6లో 0.08 ఎకరాలు, 199–6లో 0.06కి రూ.2 వేలు, ఇదే దేవస్థానానికి చెందిన నక్కపల్లి మండలం సీహెచ్ఎల్ పురంలో 72–1, 2లలో 7.48 ఎకరాలకు రూ. 20 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

జిల్లాలో పర్యావరణ విధ్వంసం ఆపాలి



జిల్లా జన విజ్ఞాన వేదిక కొత్త కార్యవర్గం

దేవరాపల్లి: జిల్లాలో పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, కె.శేషగిరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరాపల్లిలోని కైరళీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం జరిగిన అనకాపల్లి జిల్లా జన విజ్ఞాన వేదిక 18వ మహాసభకు రాష్ట్ర పరిశీలకుల హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ జిల్లాలో సైంటిఫిక్ టెంపర్ పెంచడానికి సైన్స్ మేజిక్ షోలు, సైన్స్ ప్రయోగాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. ఈ రెండు అంశాలను సభ ఆమోదిస్తూ తీర్మానం తీసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు వారు స్పష్టం చేశారు. అనంతరం జిల్లా జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎం.కె.దినేష్(దేవరాపల్లి), అధ్యక్షుడిగా ఎం.ఎస్.వి.ఎస్.పి. వర్మ(కశింకోట), ప్రధాన కార్యదర్శిగా కె.వరప్రసాద్(ఎస్.రాయవరం), ఉపాధ్యక్షులుగా బి.వి.ఎస్.వేణు(కె.కోటపాడు), బి.ఎస్.రామ్‌కుమార్(అచ్యుతాపురం), ప్రకాష్(చోడవరం) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా నాగచంద్ర, వెంకట అప్పారావు, రాంబాబు, కోశాధికారిగా ఉమామహేశ్వరరావుతో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కె.జె.పురం ప్రధానార్చకుడు దంపతులకు సత్కారం



ప్రధానార్చకుడు కోనేటి వెంకటరమణ దంపతులను సన్మానిస్తున్న భజన బృందం సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురం శ్రీసీతారామస్వామి ఆలయ ప్రధానార్చకుడు కోనేటి వెంకటరమణ, పద్మావతి దంపతుల సేవలు ప్రశంసనీయమని భక్తులు కొనియాడారు. ఆలయంలో 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్న వెంకటరమణ దంపతులను శనివారం రాత్రి ఆలయ ఆవరణలో ఘనంగా సత్కరించారు. గడిచిన మూడు తరాలుగా వెంకటరమణ కుటుంబీకులు రామాలయంను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని, ప్రధానంగా వెంకటరమణ కుటుంబం గత 30 సంవత్సరాలుగా స్వామి వారి సేవలో పునీతులయ్యారని భజన బృందం సభ్యులు ఆడారి అప్పలనర్సమ్మా, జగ్గారావు, వెంకట్రావు, శ్రీనివాసరావు, సన్యాసినాయుడు, తదితరులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆడారి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండప వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఉపాధి కోరుతూ ఆటో కార్మికుల నిరసన



ఉపాధి కోసం నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

పరవాడ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ నిరుద్యోగులుగా ఉన్న అనేక మంది బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ప్రతి నెలా కిస్తీలు చెల్లించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఉన్నారన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆటో కార్మికుల ఉపాధికి విఘాతం కలుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదన్నారు. అయితే ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హమీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ. 25 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. గ్యాస్‌పై విధించిన వ్యాట్ తగ్గించాలన్నారు. 2019లో తీసుకొచ్చిన జీవో 21ను రద్దు చేయాలని, పెంచిన అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలన్నారు. బ్యాంకుల ద్వారా ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, రాము, అప్పలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంతోషిమాత దీక్షలు



ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: శ్రావణ మాసంలో భాగంగా కె.జె.పురం జంక్షన్‌లో చేపట్టిన సంతోషిమాత అమ్మవారి దీక్షలు ఆదివారం ముగిశాయి. అమ్మవారి మాలధారణ చేసిన 30 మంది ఈ నెల 2 నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారి సన్నిధిలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఉదయం, సాయంత్రం పూజలు, అభిషేకాలు, భిక్ష చేశారు. ఆదివారం ఉదయం నుంచి మాలధారణ భక్తులు ఇరుముడులు ధరించి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన హోమం వద్ద పూజలు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మాల విసర్జన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు, ఆలయ ప్రధానార్చకుడు దొంతుకుర్తి శ్రీనివాసరావు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



గ్రంథపాలకుడు రమణను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని విశ్రాంత ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పని చేసి అచ్యుతాపురం బదిలీపై వెళ్లిన గ్రంథపాలకుడు ఎల్‌వీ రమణను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో రమణ అంకితభావంతో పనిచేశారన్నారు. విద్యాభివృద్ధికి అందించిన సేవలు అమోఘమన్నారు. తిమ్మరాజుపేట గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి వరలక్ష్మి, పెద్దలు ఆళ్ల మహేశ్వరరావు, ఎంపీ సత్యనారాయణ, టెక్కలి జగ్గారావు, ఉపాధ్యాయులు పిల్లా జగదీష్, దాడి రామప్పారావు, బీడీఎస్ సెంటర్ల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మెరక పంటలకు ప్రాణం పోసిన వర్షం



ఆగాకర సాగుకు ప్రాణం పోసిన వర్షం



వర్షం వల్ల కళకళలాడుతున్న కర్ర పెండలం తోట

గొలుగొండ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో శుక్ర, శనివారాల్లో సాయంత్రం కురిసిన భారీ వర్షం మెరక పంటలకు ప్రాణం పోసింది. ఎండిపోతున్న వరి నారుమడులకు ఎంతో మేలు చేసింది. గడిచిన 15 రోజులు నుంచి ఎండల తీవ్రత వల్ల పంటలకు ఎంతో నష్టం కలిగే పరిస్థితి వచ్చింది. నారుమడులు సైతం ఎండిపోయాయి. మెరక భూముల్లో వేసిన ఆగారక, కర్రపెండ్లం, చేదుకాకర, బీర పంటలకు ఎంతో నష్టం వాటిల్లింది. మంచి వర్షాలు కురిసే సమయంలో ఎండల వల్ల ఆయా పంటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలు ఎండిపోయే పరిస్థితి రావడంతో ఆందోళన చెందారు. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో సాయంత్రం భారీ వర్షం కురవడంతో పంటలు ఊపిరి పోసుకున్నాయి. మరో రెండు భారీ వర్షాలు కురిస్తే మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

వృద్ధుల కోసం సోషల్ సర్వీస్ గ్రూపు



గౌరీపతిని శాలువాతో సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్



గ్రూప్ సభ్యులు

అనకాపల్లి: వృద్ధుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సోషల్ సర్వీస్ గ్రూపును ఏర్పాటు చేసినట్టు విశ్రాంత డిప్యూటీ డీఈవో కె.వి.గౌరీపతి తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో సోషల్ సర్వీస్ గ్రూపు ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. గ్రూపు సభ్యులు గౌరీపతిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో సభ్యులందరి సహకారంతో అనకాపల్లి మండలంలోనే కాకుండా ఇతర మండలాల్లో అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి 9 సంస్థలకు అవసరమైన నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని అందజేశామన్నారు. అనంతరం 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు ఎం.బి.వి.స్వామి, వీరభద్రరావు, పావడ సత్యారావు, కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం'



తామరంలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మాకవరపాలెం: అమలు కాని హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి విమర్శించారు. మండలంలోని తామరంలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై ప్రజలకు వివరించారు. అన్నదాత సుఖీభవతో పాటు ఉచిత గ్యాస్ నగదు ఇప్పటికీ చాలా మందికి జమ కాలేదన్నారు. కూటమి పాలనపై ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తామరం సర్పంచ్ గొంతిన చెల్లారత్నం, తదితరులు పాల్గొన్నారు.

గౌరీ గ్రంథాలయం నూతన కార్యవర్గం ఎన్నిక





గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు రమణాజీ, వెంకటరమణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయం అధ్యక్షుడిగా బుద్ధ రమణాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణ మండలంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారిగా ఆడారి మోహన వెంకట రామచంద్రరావు, ఉపాధ్యక్షులుగా యల్లపు శ్రీను, దాడి వీరునాయుడు, సహాయ కార్యదర్శులుగా బుద్ధ జోగినాయుడు, కాండ్రేగుల నూకరాజు, కన్వీనర్‌గా బొడ్డేడ అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా 23 మంది ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నూకాంబికా దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల వెంకటరావు, దాడి స్వామినాయుడు, పి.నరసింగరావు వ్యవహరించారు. పై కమిటీ ఎన్నిక 2029 వరకు ఉంటుందని ఎన్నికల అధికారులు చెప్పారు.

వరి నారుమడులకు తెగుళ్ల బెడద



ఆకుమడిని ఆశించిన పొడతెగులు భాగం, తెగులు పట్టిన ఆకుమడిలో పిచికారీ చేస్తున్న రైతు

రోలుగుంట: మండలంలో వరి నారుమడులు అనంతరం కలిసిరాని వాతావరణంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అసలే వర్షధార మండలం. ఆపై ఎండలు. దీంతో వరి నారుమడులకు అనుకూల తడులు లేక ఎండిపోతున్నాయి. మరో పక్క తెగులు బెడద వెంటాడుతోంది. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి చిరంజీవి పలు సూచనలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో ఆకుమడికి 100 ఎం.ఎల్ హెక్సో కొనజోల్‌ను పిచికారీ చేస్తే తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందన్నారు.